క్లుప్తంగా

నేడు ఎలక్ట్రానిక్ సిటీలో విద్యుత్ సరఫరా నిలిపివేత

మహేశ్వరం: మండల కేంద్రంలోని ఎలక్ట్రానిక్ సిటీలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ చక్రపాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారుదులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



బీరప్ప ఆలయం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని బీరప్ప కాలనీలో నూతనంగా నిర్మించిన బీరప్ప ఆలయంలో ఈ నెల 21న బీరప్పస్వామి కామరాతిదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అదే రోజు ఉదయం 11.45 గంటలకు బీరప్ప స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు పెద్ద కురుమ గౌర సత్యనారాయణ, దొడ్డి మల్లికార్జున, కురుమ సంఘం బడంగ్‌పేట్ పెద్దలు తెలిపారు. అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవానికి కేంద్ర మంత్రులు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని కల్యాణ ఘట్టాలను కనులారా వీక్షించాలని కోరారు.

పీఏసీఎస్‌కు నిధులు కేటాయించాలి



డీసీసీ బ్యాంక్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఏసీసీ చైర్మన్, డైరెక్టర్

కందుకూరు: కందుకూరు పీఏసీఎస్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ చైర్మన్ డి.చంద్రశేఖర్, జిల్లా డైరెక్టర్ పి.ఆనంద్ శనివారం డీసీసీ బ్యాంక్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సొసైటీకి పంట రుణాల కోసం రూ.2 కోట్లు, దీర్ఘకాలిక రుణాలకు రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో మంజూరు చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఆ రుణాలు వచ్చిన వెంటనే రైతులకు సకాలంలో కేటాయించడానికి ఉపయోగపడతాయన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఆదిబట్ల చైర్మన్ నిరంజన్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం పురపరిధి 1,13,14 వార్డుల్లో మున్సిపల్ నిధులు రూ.65 లక్షలతో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ దశల వారీగా పురపాలికను అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా.. వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. వెంటనే సమస్యకు పరిష్కారం చూపుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లావణ్య, అర్చన, పట్నం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అయిలయ్య, కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ బాలకృష్ణ, డీఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణ టీకా తప్పనిసరి



ఆవుకు టీకా వేస్తున్న డాక్టర్ భానునాయక్

కడ్తాల్: పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి భానునాయక్ సూచించారు. ముందస్తుగా వాటికి ఎఫ్ఎండీ టీకా వేయించాలని చెప్పారు. శనివారం మండల పరిధి పలు గ్రామాల్లో బృందాలుగా ఏర్పడి 550 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రమేశ్, జూనియర్ వెటర్నరీ అధికారులు మల్లేశ్, రాజేశ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ఛిద్రం.. జర భద్రం

- అధిక లోడుతో భారీ వాహనాల పరుగు.. ధ్వంసమైన రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు

కడ్తాల్: అసలే గ్రామీణ ప్రాంతాల రోడ్లు అంతంత మాత్రంగానే ఉంటాయి. ఆపై పట్టించుకునే వారు లేకపోతే ఇక వాటి దుస్థితి వర్ణించడం కష్టం. సర్పంచుల పదవీకాలం ముగిసిన నాటి నుంచి పల్లెల రోడ్ల మార్గం గురించి పట్టించుకునే వారే కరువయ్యారన్న ఆరోపణలు లేకపోలేదు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలతో దారులు అధ్వానంగా మారాయి. అధిక లోడుతో దూసుకుపోతున్న భారీ వాహనాలతో ఛిద్రమయి.. మార్గం గుండా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికుల ఒళ్లు హూనం అవుతోంది.

రూ1.10కోట్లతో మూడేళ్ల క్రితం

శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి నుంచి కడ్తాల్ మండలం గడ్డమీదితండాకు మూడేళ్ల క్రితం ప్రాంత ప్రజల రవాణ సౌకర్యం కోసం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ రూ1.10 కోట్లతో బీటీరోడ్డు నిర్మించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. పరిసర ప్రాంతాల్లో రెండు కంకర క్రషర్ ప్లాంట్లు ఉండటంతో, నిత్యం 40 నుంచి 50 టన్నుల కంకర లోడుతో టిప్పర్లు పరుగులు తీస్తున్నాయి. దీంతో రహదారి పూర్తిగా ధ్వంసమయింది. పగుళ్లు, గోతులు ఏర్పడి క్రమంగా రోడ్డు ఆనవాళ్లు కోల్పోయి.. గిరిజనుల రవాణాకు కష్టంగా మారింది. ధ్వంసమైన రోడ్డులో ప్రయాణించాలంటే నరకంగా ఉందని వాపోతున్నారు. రోడ్లు వేసి ఎంతో కాలం కాలేదని, సంబంధిత అధికారులు స్పందించి భారీ వాహనాలను కట్టడి చేసి, రహదారికి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





ఆనవాళ్లు కోల్పోయిన గడ్డమీదితండా బీటీరోడ్డు (ఇన్‌సెట్లో) రోడ్డు దుస్థితి

స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి



శిక్షణ శిబిరంలో సొసైటీ ఎకనామికల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మహేశ్వరం: స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలని సొసైటీ ఫర్ ఎకనామికల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ సంస్థ అధ్యక్షురాలు క్రాంతి అన్నారు. మండల పరిధి దుబ్బచర్ల గ్రామంలో నాబార్డు సహకారంతో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్, ఎంబ్రాయిడింగ్ శిక్షణ శిబిరాన్ని సంస్థల ప్రతినిధులు శనివారం సందర్శించారు. గ్రామంలో మహిళలకు 20రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఎంబ్రాయిడింగ్ శిక్షణ నేర్చుకున్న వారు భవిష్యత్‌లో స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగొచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు శిక్షణ శిబిరాన్ని ఆమెతో పాటు సంస్థ ప్రతినిధులు సందర్శించి శిక్షకులు, నేర్చుకుంటున్న మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శరత్ చంద్ర, రమేశ్, హాజీ బాబా, ఎంబ్రాయిడింగ్ ట్రైనర్ ప్రేమలత, డ్వాక్రా సంఘం సభ్యులు రమాదేవి, ఖుషీ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మహేశ్వరం: మండల పరిధిలోని ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి, అమీర్‌పేట్ గ్రామంలో సీతారాంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, హారతి, మంత్రపుష్పం, పుష్పాలంకరణతో పాటు తమలపాకులతో అర్చన పూజ కార్యక్రమాలు చేశారు. ఘట్టుపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో దంపతులు సత్యనారాయణ వ్రతాలు చేశారు. శనివారం కావడంతో మండలంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ట్రస్టీలు కోరుపోలు రఘుమారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమీర్‌పేట్ ఆంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు అంజయ్య ముదిరాజ్, ఆలయ అర్చకులు తొండుపల్లి సంతోష్‌శర్మ, వీరేశం, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- పార్టీ కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు

కడ్తాల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. అమలు కానీ హామీలతో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానాకాలం సాగు రైతుభరోసా నేటికీ అందించలేదని, భరోసాకు మంగళం పాడే ప్రయత్నాలు ప్రభుత్వం చేస్తుందని పేర్కొన్నారు. హామీల అమలుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, నాయకులు రామకృష్ణ, జోగు వీరయ్య, రమేశ్, చంద్రమౌళి, లోకేశ్, హరిచంద్, నర్సింహగౌడ్, సాయిలు, నర్సింహ, బాలకృష్ణ, పాండు, యాదయ్య, మహేశ్, గంప శ్రీను, అంజి, శ్రీకాంత్, వినోద్, కృష్ణ తదితరులు ఉన్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి

మహేశ్వరం: ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటలు వేసుకునే రైతులకు 3 సంవత్సరాల పాటు మెయింటనెన్స్ ప్రభుత్వం అందిస్తుందని మండల ఉద్యానవన శాఖ అధికారి సౌమ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్చింగ్ వేసుకునే రైతులకు 50 శాతం, నీటి కుంటలకు 50 శాతం, కూరగాయ పందిర్లకు 50 శాతం, వెదురు మొక్కలపై రాయితీని అందజేస్తుందని పేర్కొన్నారు. జీడిమెట్ల నుంచి రైతులకు ఉచితంగా టమాటా, వంకాయ, మిర్చీ, క్యాబేజీ, కాలీఫ్లవర్, నారును ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నారు అవసరం ఉన్న రైతులు 30రోజుల ముందుగా మండల ఉద్యానవన అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. పూర్తివివరాలకు మహేశ్వరం వ్యవసాయ, ఉద్యానవన అధికారుల కార్యాలయాలను, మండల ఉద్యానవన అధికారిని ఫోన్ నంబర్ 8977714221లో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

తలకొండపల్లి: పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని చంద్రధన గ్రామస్తులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజెందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు లేవని, తరగతి గదులకు తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, పాఠశాల మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగిరం



సమావేశంలో సంస్థ ప్రతినిధి, తాపీ మేస్త్రీలు

తుర్కయంజాల్: మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ బద్రి తెలిపారు. ఈ సిమెంట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి సరైన ఎంపిక అని పేర్కొన్నారు. శనివారం ఇంజాపూర్ వేంకటేశ్వర ట్రేడర్స్ డీలర్ షాప్‌లో తాపీ మేస్త్రీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదుగుతుందని తెలిపారు. అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్‌గా సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ తెలంగాణలో విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈ సిమెంట్‌ను వినియోగించే వారికి ఉచితంగా సాంకేతిక సహాయం, స్లాబ్ కాంక్రీట్ వేసే సమయంలో నిపుణులైన సంస్థ ఇంజినీర్లు సహాయపడతారని స్పష్టంచేశారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతికి ధర రూ.20 తక్కువేనని డీలర్ శివ శాంతం రెడ్డి తెలిపారు.

మార్కెట్ కమిటీలో చోటు కల్పించండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి



ఎమ్మెల్యే మల్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీ నాయకులు

మంచాల: ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీలో చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు కావలి బుగ్గరాములు కోరారు. శనివారం నగరంలో పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతున్నానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. రెండు పర్యాయాలు పార్టీ తరఫున సర్పంచ్‌గా పోటీ చేశానని వెల్లడించారు. కావున తనకు మార్కెట్ కమిటీలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పండరినాథ్ గౌడ్, పార్టీ నాయకులు సత్యనారాయణ గౌడ్, వెంకటరమణారెడ్డి, జంగయ్య గౌడ్, వైఎస్సార్ యువసేన నాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై.. పెద్దలు శ్రద్ధ చూపాలి

- నిత్యం బడికి వస్తేనే.. పాఠాలు అర్థమవుతాయి
- మండల విద్యాధికారి రాందాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

మంచాల: విద్యార్థులు క్రమ తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ రాందాస్ అన్నారు. శనివారం రంగాపూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిత్యం బడికి వచ్చినప్పుడే ఉపాధ్యాయులు బోధించే పాఠాలు అర్థమవుతాయని పేర్కొన్నారు. టీచర్లు కూడా పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి చదువులో ప్రగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అపార్ ఐడీ గురించి వివరించారు. నర్సరీ నుంచి పై చదువులకు సంబంధించిన సర్టిఫికెట్లు అన్ని అపార్ ఐడీ ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఐడీ కోడ్ నంబర్‌తో వాటిని చూసుకోవచ్చునని వెల్లడించారు. ఒకవేళ సర్టిఫికెట్లు పోయినా.. కోడ్ ద్వారా తిరిగి వాటిని పొందవచ్చని స్పష్టంచేశారు. కార్యక్రమంలో చీదేడ్, రంగాపూర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శంకర్, నిర్మల బాయి పాల్గొన్నారు.

చీదేడ్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయండి



ఏడీ సీతారాంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంచాల: విద్యుత్ సమస్య పరిష్కారం కోసం చీదేడ్ గ్రామంలో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి సమస్యను వివరించారు. దీనికి స్పందించిన ఆయన.. విద్యుత్ శాఖ ఏడీ సీతారాంను ఫోన్‌లో సంప్రదించారు. చీదేడ్‌లో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. అనంతరం నాయకులు పట్నంలో ఏడీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి బోడకొండలోని సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని తెలిపారు. దీని కారణంగా మూడు దశాబ్దాలుగా విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. గాలి దుమారం, వర్షం పడిన ప్రతిసారి సమస్య ఉత్పన్నం అవుతుందని వెల్లడించారు. స్థానికంగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం వలన చీదేడ్‌తో పాటు దాద్‌పల్లి, వేంకటేశ్వరతండా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్పష్టంచేశారు. అఖిలపక్ష నాయకులు చరణ్, శ్రీనివాస్, వెంకటేశ్, ప్రకాశ్‌రెడ్డి, వెంకయ్య, బాలయ్య, శంకరయ్య, నర్సింహ, సత్తయ్య, యాదయ్య, జంగయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కల్వకుర్తికి మహర్దశ

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇందుకు నిదర్శనం దివంగత కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణలో కానిస్టేన్సీకి వరాలజల్లు కురిపించడమేనని తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హామీమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. బీటీరోడ్ల నిర్మాణానికి రూ.204 కోట్లు మంజూరు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ సహకారం, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కృషితో నియోజకవర్గంలో భారీగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఇందుకు పార్టీలకు అతీతంగా అందరూ కలిసిరావాలని శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

ఇబ్రహీంపట్నం మండల ఇందిరమ్మ కమిటీలు పూర్తి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం 14 గ్రామ పంచాయతీల ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఎంపిక పూర్తయిందని ఎంపీడీఓ వెంకటమ్మ తెలిపారు. కమిటీ జాబితాను శనివారం జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు ఆమె పేర్కొన్నారు. చైర్మన్‌గా గ్రామ ప్రత్యేకాధికారి, కన్వీనర్‌గా జీపీ కార్యదర్శి, స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు మహిళలతో పాటు ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలకు చెందిన ఒక్కొక్కరినీ ఈ కమిటీలో సభ్యులుగా నియమించిన సంగతి తెలిసిందే. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుల ఎంపికతో పాటు, నిర్మాణాలు పూర్తయ్యే వరకు ఈ కమిటీ పర్యవేక్షణ కీలకం కానుంది.

సమగ్ర కులగణనకు కసరత్తు



జీపీ కార్యదర్శులు, గణాంకాధికారులతో ఎంపీడీఓ వెంకటమ్మ

- ప్రభుత్వ ఆదేశాలే తరువాయి
- ప్రణాళిక సిద్ధం చేస్తున్న రెవెన్యూ అధికారులు
- కిందిస్థాయి సిబ్బందికి శిక్షణ

ఇబ్రహీంపట్నం: కులగణన చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. అయినప్పటికీ.. సంబంధిత అధికారులు, ప్రభుత్వం ఎప్పుడు ఆదేశించినా.. సమగ్ర కులగణన చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. ఇబ్బందులు తలెత్తకుండా గణన సాఫీగా సాగేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తీవ్ర కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా ఎలా ముందుకు వెళ్లాలో కిందిస్థాయి సిబ్బందికి రెవెన్యూ అధికారులు శిక్షణలు ఇస్తున్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. ఇదే అంశంపై ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నట్లు సమాచారం. 2011 జనాభా లెక్కలను ఏ ప్రతిపాదికన చేపట్టారో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గ్రామాల వారీగా 150 మందికి ఒక బ్లాక్‌ను ముందుగా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ దిశగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ ప్రణాళికను రూపొందిస్తున్నారు. కులగణనలో జీపీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, వీబీకేలతో పాటు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లను భాగస్వామ్యం చేయనున్నట్లు తెలుస్తోంది.

ఎంపీడీఓ నేతృత్వంలో..

ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటమ్మ నేతృత్వంలో శనివారం జీపీ కార్యదర్శులకు రెవెన్యూ గణాంక అధికారులు కులగణన గురించి శిక్షణ ఇచ్చారు. సలహాలు, సూచనలు ఇస్తూ అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఎప్పుడు ఆదేశించినా కులగణన చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

గోదాంను వినియోగంలోకి తేవాలి



గోదాంను పరిశీలిస్తున్న సంఘ్ సభ్యులు

మంచాల: రైతుల అవసరాలకు గోదాంను వినియోగించాలని భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు ఎడ్మా రాంరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్నదాతల అవసరాల కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన గోదాం నిరుపయోగంగా మారిందని పేర్కొన్నారు. వినియోగంలోకి తెచ్చి, ధాన్యం సేకరణ కేంద్రంగా మార్చితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అదే విధంగా వ్యవసాయ పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను మార్చాలని కోరారు. ఈ నెల 23న నగరంలోని ఎర్రగడ్డలో నిర్వహించే సమావేశంలో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మండల కార్యదర్శి మధు, కార్యవర్గ సభ్యుడు భిక్షపతి, సాలయ్య, రాజేందర్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, జలందర్‌రెడ్డి, జంగయ్య, శేఖర్ రెడ్డి, ప్రవీణ్ యాదవ్, యాదయ్య, కృష్ణ కాంత్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.